భాష, సంస్కృతి ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి

గచ్చిబౌలి: నీతి, నిజాయితీ, మంచి నడవడిక నేర్పేది మాతృభాషయేనని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ పి వారిజారాణి పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని శేరిలింగంపల్లి డివిజన్‌లోని కొండాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ టి రామస్వామియాదవ్ ఆధ్వర్యంలో బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి భాషలేనిదే మానవజాతికి వికాసం లేదని, అన్యభాషలు ఎన్ని నేర్చుకున్నా మాతృభాషలో ప్రావీణ్యుడు కాలేనివాడు విజ్ఞాన సముపార్జన చేయలేడని స్పష్టం చేశారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన తల్లి భాష నేడు తల్లడిల్లుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రపంచ వ్యాప్తంగా వేల కొలది మాతృభాషలు కనుమరుగయ్యే పరిస్థితులు ఉన్నాయంటూ యునెస్కో హెచ్చరిస్తుందని గుర్తుచేశారు. ప్రపంచీకరణ వలన ప్రపంచమంతా మనకు దగ్గరవుతుండగా మన భాష మాత్రం మనకు దూరమువతుందన్నారు. భాష, సంస్కృతులు ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయని, కాబట్టి మారుతున్న మన సంస్కృతితోపాటు మన భాష కూడా మార్పులు చెందుతూ ఉంటుందన్నారు. ప్రధానోపాధ్యాయుడు పల్లె అనంతరెడ్డి, ఉపాధ్యాయులు నాగలక్ష్మీ, పుష్పలీల, స్వాతి, అసోసియేషన్ సభ్యులు వాణి సాంబశివరావు, శ్రీనివాస్, జనార్దన్, శివరామకృష్ణ, అమ్మయ్యచౌదరి విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధికి మహిళల మద్దతు అవసరం

రాయదుర్గం: ఏ సమాజం అభివృద్ధి చెందాలన్నా మహిళల మద్దతు వసరమని 'మనూ' రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ అన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిస్టరీ సహకారంతో ఫర్‌ది స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ ఆధ్వర్యంలో 'భారతదేశం లో ఉమెన్స్ మార్జినలైజేషన్ యొక్క డైనమిక్స్ ఎక్స్‌ప్లోరింగ్–చాలెంజెస్ అండ్ ప్రాస్పెక్ట్స్' అంశంపై రెండు రోజుల జాతీయస్థాయి సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళల మినహాయింపు, వివక్ష గురించి అధ్యయనం చేయడం ప్రస్తుత తరుణంలో ఎంతో అవసరముందన్నారు. అనంతరం సెమినార్‌లో 25కు పైగా పరిశోధనా పత్రాలను సమర్పించారు.

'డిజిటల్ ఇండియా'పై వర్క్ షాప్

పటాన్‌చెరు: గ్రామీణ ప్రాంతాలలో డిజిటల్ ఇండియా ప్రభావం, తెలంగాణలో అన్వేషణాత్మక అధ్యయనం అనే అంశంపై గీతం విశ్వవిద్యాలయం ఒక రోజు వర్క్‌షాప్‌ని నిర్వహించినట్టు ప్రాజెక్టు డైరెక్టర్, గీతం అధ్యాపకుడు డాక్టర్ గుర్రం అశోక్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్) సౌజన్యంతో దీనిని నిర్వహించినట్టు తెలిపారు. అట్టడుగుస్థాయిలో డిజిటల్ ఇండియాపై విధాన పరిశోధన ఆవశ్యకతను వివరించారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం

రాయదుర్గం: బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం సందర్భంగా గోపన్‌పల్లిలో పండగ వాతావరణం నెలకొంది. బుధవారం ఉదయం బొడ్రాయికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గోపన్‌పల్లి వాసులంతా బొడ్రాయిని దర్శించుకొన్నారు. ఉత్సవంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాయిబాబా, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

వేస్ట్ మేనేజ్‌మెంట్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్

పటాన్‌చెరు టౌన్: ఎల్రక్టానిక్ వ్యర్థాలను సమర్థవంతంగా రీ సైకిల్ చేయడం ద్వారా మానవాళిని ప్రమాదాల బారి నుంచి కాపాడవచ్చని టాస్క్ ట్రైనర్ సుప్రియ అన్నారు.బుధవారం పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) ఆధ్వర్యంలో వేస్ట్ మేనేజ్‌మెంట్ అవేర్‌నెస్ సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ... ఎల్రక్టానిక్ పరికరాల ఉపయోగం పెరుగుతున్న కొద్దీ వాటి వ్యర్థాల వలన కలిగే భారీ నష్టాల గురించి విద్యార్థులకు వివరించారు .కళాశాల కోఆర్డినేటర్ ఆర్ కృష్ణ , ప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

38 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది .ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం....సోమ, మంగళవారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 38 మందిని పట్టుబడగా వారిని బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 38 మందికి ఒక్కొక్కరికీ రూ.వెయ్యి జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

అదృశ్యమైన బాలుడి ఆచూకీ లభ్యం

తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

హఫీజ్‌పేట్: చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం అదృశ్యమైన బాలుడు సాత్విక్ బుధవారం ఆచూకీ లభించింది. లింగంపల్లి పరిసర ప్రాంతాలలో సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులకు లింగంపల్లి మార్కెట్‌లో తిరుగుతూ కనిపించాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు బాలుడు సాత్విక్‌ను తీసుకొచ్చి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. సీఐ పాలవెల్లి సాత్విక్‌ను తల్లిదండ్రులైన కుమారస్వామి, సమతలకు అప్పగించారు. బాలుడి ఆచూకీని కనుగొన్న పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు.

చికిత్స పొందుతూ కార్మికుడు మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ కార్మికుడు మృతి చెందిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండల పరిధిలోని పాశమైలారం పారిశ్రామికవాడలోని సిఎంహెచ్ లాబొరేటరీస్ పరిశ్రమలో 13వ తేదీన పరిశ్రమలో కార్మికులు పనిచేసే చోట పేలిన ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో హైదరాబాద్ కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఒరిస్సాకు చెందిన మొంటు మాలిక్ (27) మంగళవారం రాత్రి మృతి చెందాడు సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్‌కు వెళ్తున్నానని చెప్పి..

పటాన్‌చెరు టౌన్: హోటల్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... వెస్ట్ బెంగాల్ కు చెందిన సుభాష్ ముడీ, తుంపపాత్ర(25) బతుకుదెరువు కోసం రెండు నెలల క్రితం పటాన్‌చెరు మండల పరిధిలోని పాశమైలారంలో ఉంటున్నారు. సుభాష్ ముడీ ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తుండగా, అతడి భార్య తుంప పాత్ర పాశమైలారంలోని వాసుదేవ హోటల్లో పని చేస్తోంది. ఈ క్రమంలో రోజు మాదిరిగానే మంగళవారం హోటల్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన తుంబ పాత్ర హోటల్ కి వెళ్లి అక్కడి నుండి చెప్పకుండా వెళ్ళిపోయింది.దీంతో సుభాష్ తన భార్య కోసం తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికిన ఆచూకీ లభించలేదు.బుధవారం భార్య అదృశ్యంపై భర్త సుభాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పరీక్షలు సజావుగా నిర్వహించాలి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



సాక్షి,మేడ్చల్‌జిల్లా: ఇంటర్, పదో తరగతి పరీక్షలు సజావుగా నిర్వహించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షా కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఇంటర్మీడియట్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలు–2024కు సంబంధించి డీఐవో కిషన్, డీఈవో విజయకుమారితోసహా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పరీక్షల నిర్వహణలో అధికారులు సమన్వయంతో తమ విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలకు 139 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, ప్రథమ సంవత్సరంలో 65,965 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరానికి 65,495 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. ఈనెల 28 నుంచి మార్చి 19 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9. నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు.

పదో తరగతి పరీక్షలు ఇలా..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు జరుగుతాయని జిల్లా అదనపు కలెక్టర్ తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు సంబంధించి 231 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఉంటాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 47406 (రెగ్యులర్ 46834, ప్రైవేట్ 572) మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూం నుంచి పరీక్షా కేంద్రానికి, పరీక్షా కేంద్రం నుంచి స్ట్రాంగ్ రూంకు ఎగ్జామ్ మెటీరియల్ తరలించడంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పరీక్షలు నిర్వహించే సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఏర్పాటు చేశామన్నారు. అవసరమైన పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేయాలని కోరారు. పరీక్షా కేంద్రాల నుంచి జవాబు పత్రాలను పకడ్బందీగా తీసుకువెళ్లేందుకు పోస్టల్ శాఖ సహకరించాలన్నారు.విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు అనుమతి లేదని అదనపు కలెక్టర్ తెలిపారు. పరీక్షలను పారదర్శకంగా విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు,రాచకొండ,సైబరాబాద్ పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలకు ఎమ్మెల్యే గాంధీ క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ సీనియర్ నేత సిందం శ్రీకాంత్



భాగ్యనగర్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గాంధీ జీహెచ్ఎంసీ కౌన్సిలింగ్ సమావేశం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ సీనియర్ నేత సిందం శ్రీకాంత్ అన్నారు. కొంతమంది కాంగ్రెస్ నాయకులు కొత్త బిచ్చగాళ్ల అవతారం ఎత్తి వారికి సంబంధం లేని డివిజన్లలో ఎమ్మెల్యే, కార్పొరేటర్లకు తెలియకుండా సమస్యలను పరిష్కరిస్తామని అని అనడం విడ్డూరంగా ఉందన్నారు. చట్టం ప్రకారం జీహెచ్ఎంసీ పరిధిలో నివసిస్తున్న ప్రతి పౌరుడు ప్రజా సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తే తప్పేమిటి అని ప్రశ్నించారు. జగదీశ్వర్‌గౌడ్‌కు ప్రజల నుంచి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక బిచ్చగాళ్లు అనే అసభ్యకర పదజాలాన్ని వాడారని అన్నారు. ఎమ్మెల్యే పదవీలో ఉండి ఈ రకంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఈ వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకొని కాంగ్రెస్ పార్టీ నాయకులకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

ఫతేనగర్ అభివృద్ధికి అధిక నిధులు



సమతానగర్ కమ్యూనిటీహాల్ రెండో అంతస్తు స్లాబ్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

మూసాపేట: మూసాపేట సర్కిల్, ఫతేనగర్ డివిజన్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా నిదులు కేటాయిస్తున్నట్లు కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ తెలిపారు. బుధవారం రూ.20లక్షలతో సమతానగర్ కమ్యూనిటీహాల్ రెండో అంతస్తు స్లాబ్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రత్యేకమైన దృష్టితో ఫతేనగర్ డివిజన్‌కు అధిక నిధులు మంజూరు చేస్తామన్నారు. రోజురోజుకి అభివృద్ధి చెందుతున్న ఫతేనగర్ డివిజన్‌లో సీసీ రోడ్లు, మంచినీటి సౌకర్యం, పారిశుద్యం పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అధికారుల సమన్వయంతో ప్రతి ఒక్కరూ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రాజేందర్, జనరల్ సెక్రటరీ నరసింహ, వైస్‌ప్రెసిడెంట్ వెంకటేష్ పాల్గొన్నారు.

పట్టపగలే వెలుగులు



వివేకానందనగర్ కాలనీలో పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు

ఆల్విన్‌కాలనీ: విలువైన విద్యుత్‌ను ఆదా చేయాల్సిన అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా విద్యుత్‌ను వృథా చేస్తున్నారు. కూకట్‌పల్లి వివేకానంద నగర్‌కాలనీలో పట్టపగలే వీధి లైట్లు కొన్ని నెలలుగా వెలుగులు విరజిమ్ముతున్నాయి. విద్యుత్ అధికారులు సాయంత్రం వీధి దీపాలు వెలిగించి, ఉదయం వీధిదీపాలను ఆపివేయాల్సిన వారు నిర్లక్ష్యం వహించటంతో కొన్ని నెలలుగా వీధి దీపాలు పగలు, రాత్రి అనే తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. మరికొన్ని వీధుల్లో వీధి దీపాలే వెలగకుండా చిమ్మ చీకటిలో వీధులన్నీ కనిపిస్తున్నాయి. పోకిరీలు, దొంగలను గుర్తించకుండా సీసీ కెమెరాలు సైతం కనిపించకుండా చీకటిమయంగా ఉంటున్నాయని పేర్కొంటున్నారు. వీధి దీపాలకు ఆటోమెటిక్ సెన్సింగ్ ఉన్నప్పటికీ అవి కూడా పనిచేయకుండా పోయాయని వాటిని కూడా మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ డివిజన్‌లలో పట్టపగలే వీధి లైట్లు వెలుగుతూ ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, కాలనీలో పర్యటించి పరమ్మతులు చేపట్టి అన్ని ప్రాంతాల్లో రాత్రి వెలిగే విధంగా ఆటోమేటిక్ సెన్సార్ విధానంలో లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చట్టసభల్లో బీసీల వాటా కోసం 1 నుంచి మహా పాదయాత్ర

కాచిగూడ: చట్టసభల్లో బీసీల వాటా సాధన కోసం మార్చి 1వ తేదీ నుంచి మహా పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ తెలిపారు. పండుగ సాయన్న ముదిరాజ్ స్వగ్రామం మీర్జాన్‌పల్లె నుంచి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కోట ఖిలాషాపూర్ వరకు పాదయాత్ర జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర బీసీ కుల జనగణన బిల్లు పెట్టడం తెలంగాణ బీసీ సమాజం పోరా ట విజయమని ఆయన అన్నారు. ఏదైనా రాష్ట్రంలో ఆయా ప్రభుత్వాలు బీసీలకు రిజర్వేషన్ల పెంపు కోసం ప్రయత్నిస్తే వెంటనే సంఘ్ పరివార్ శక్తులు కోర్టులో కేసులు వేస్తుంటాయని, దీంతో జనా భా లెక్కలు లేకుండానే రిజర్వేషన్లు ఎలా పెంచుతారని కోర్టులు మోకాలడ్డుతాయని పేర్కొన్నారు. మరోవైపు కేంద్రం కుల జనగణన చేయనంటోదని, కేంద్రం, సుప్రీం కోర్టు మధ్య ఓబీసీల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలాగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీసీల హక్కుల సాధనకై.. చట్టసభల్లో బీసీల వాటా సాధన కోసం జరిగే మహా పాదయాత్రలో బీసీలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఓయూలో బైపాస్ రోడ్డు పనులు ఆపాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో చేపట్టిన బైపాస్ రోడ్డు పనులను నిలిపి వేయాలని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అలివేలి రాజు బుధవారం డిమాండ్ చేశారు. క్లోజ్‌డ్ క్యాంపస్ పేరుతో రూ.16 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బైపాస్ రోడ్డుతో ఎవరికి ఉపయోగం లేదన్నారు. కేవలం రూ. కోట్లల్లో విలువ చేసే ఓయూ భూముల కబ్జా కోసమే గత బీఆర్ఎస్ ప్రభుత్వం బైపాస్ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించారని రోడ్డు పనులు ఆపకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

వాటర్‌వర్క్స్ పనులు త్వరగా పూర్తి చేయండి



మూసాపేట: వాటర్‌వర్క్స్ బోర్డు జనరల్ మేనేజర్ ప్రభాకర్‌ని ఆయన కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు కలిసి సమస్యలను వివరించారు. బాలాజీనగర్ డివిజన్‌లో అసంపూర్తిగా ఉన్న వాటర్ వర్క్స్ పనులు పూర్తి చేయాలని కోరారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని త్వరగా పూర్తిచేసి నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తిచేయాలని కోరారు. వాటర్ వర్క్స్ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

ఓయూలో జాతీయస్థాయి షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో వచ్చే నెల 27, 28 తేదీలలో జాతీయ స్థాయిలో షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ పోటీలను నిర్వహించనున్నారు. బుధవారం ఓయూ వీసీ ప్రొ.రవీందర్ ఫిల్మ్ ఫెస్టివల్ విజయవంతం కోసం రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో జాష్న్–ఏ–సైన్మా పేరుతో జరిగే షార్ట్స్ ఫిల్మ్ ఫెస్టివల్ పోటీలలో దేశ వ్యాప్తంగా డిగ్రీ, పీజీ, విద్యార్థులతో పాటు పీహెచ్‌డీ విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చని జర్నలిజం విభాగం హెడ్ ప్రొ.సతీష్ తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు.

ఎస్ఎఫ్ఐ నాయకులపై దాడిని ఖండిస్తున్నాం

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి

బాలానగర్: జేఎన్‌టీయూహెచ్‌లో విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడానికి వెళ్లిన ఎస్ఎఫ్ఐ బృందంపై ఏబీవీపీ నాయకులు ఘర్షణకు పాల్పడ్డారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎస్ఎఫ్ఐ బృందం విద్యార్థుల సమస్యలు విని వస్తున్న సమయంలో ఏబీవీపీ నాయకులు ఘర్షణకు దిగారన్నారు. జిల్లా అధ్యక్షుడు కార్తిక్‌ను తిడుతూ దాడి చేసి గాయపర్చారన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి పోరాడుతున్న ఎస్ఎఫ్ఐపై ఓర్వలేక దాడులు చేస్తున్నారని అన్నారు. ఈ దాడులకు నిరసనగా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ఏబీవీపీ దిష్టిబొమ్మల దహనానికి పిలుపు నిస్తున్నట్లు పిలుపునిచ్చారు. ఇకనైనా దాడుల సంస్కృతిని ఏబీవీపీ నాయకులు మానుకోవాలన్నారు. లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తెలిపారు.

ఘనంగా సమ్మక్క, సారలమ్మ జాతర

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్, ఆస్‌బెస్టాస్‌కాలనీలోని సమ్మక్క, సారలమ్మ జాతర మహోత్సవములు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం సారలమ్మ తల్లి గద్దెకు వచ్చుట, 22వ తేదీ సమ్మక్క తల్లి గద్దెకు వచ్చుట, 23వ తేదీ భక్తులు అమ్మవార్లకు మొక్కులు సమర్పించుట 24వ తేదీ అమ్మవార్ల వన ప్రవేశం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భ క్తులు విరివిగా పాల్గొని సమ్మక్క, సారలమ్మ అమ్మవార్ల అనుగ్రహం పొందాలని కోరారు.

26న ఓయూకు మంత్రి పొంగులేటి రాక

ఉస్మానియాయూనివర్సిటీ: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ నెల 26న ఓయూ క్యాంపస్‌కు రానున్నారు. ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.గణేష్ ఉద్యోగ విరమణ సందర్భంగా 133 తరగతి గదిలో ఏర్పాటు చేసిన జాతీయ సదస్సుకు మంత్రి హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు. వీసీ ప్రొ.రవీందర్‌తో పాటు టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొ.కోదండరామ్ కూడా హాజరవుతారన్నారు.

ఓయూ తెలుగు శాఖ అధిపతిగా ప్రొ.కమలాకర శర్మ

ఉస్మానియాయూనివర్సిటీ: ఓయూ తెలుగు శాఖ అధిపతిగా ప్రొ.సాగి కమలాకర శర్మ రెండేళ్ల కాల వ్యవధికి నియమితులయ్యారు. ఇంత కాలం అధిపతిగా కొనసాగిన ప్రొ.కాశీం పదవీ కాలం ముగియడంతో తెలుగు శాఖకు బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ (బీఓఎస్) ఉన్న ప్రొ.శర్మ బుధవారం బాధ్యతలు స్వీకరించగా తన పీహెచ్‌డీ శిష్యురాలు డాక్టర్ అరవింద పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఉత్తమ బోధనకులు, పరిశోధనకులుగా పేరుగాంచిన ప్రొ.శర్మ జ్యోతిష్యం, సాహిత్యంపై పది పుస్తకాలను రాశారు. తెలుగుతో పాటు సంస్కృతం, ఇంగ్లిష్, జ్యోతిష్యం, ఫిలాసఫీ, యోగా శాస్త్రంలో ఎంఏలు, జర్నలిజం, ప్రాకృతంలో పీజీ డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన ప్రొ.శర్మ బహుభాషా కోవిదుడు. ప్రొ.శర్మ వద్ద 14 మంది విద్యార్థులు పీహెచ్‌డీ పూర్తి చేయగా మరో పది మంది వివిధ అంశాలపై పరిశోధనలు చేస్తున్నారు.

శోభన బస్టాప్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించండి

సీపీఎం కార్యదర్శి రాజశేఖర్ విజ్ఞప్తి

బాలానగర్: బాలానగర్ శోభన బస్‌స్టాప్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సీహెచ్ కృష్ణయ్యకు సీపీఎం పార్టీ బాలానగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ మాట్లాడుతూ.. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసేలా బాలానగర్ వద్ద ఏర్పాటు చేయాల్సిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఫిరోజ్‌గూడలో ఏర్పాటు చేశారన్నారు. ఇక్కడ ఎక్కువ మంది ఫుట్ ఓవర్ బ్రిడ్జిని వినియోగించక పోవడంతో నిరుపయోగంగా ఉందన్నారు. శోభన బస్‌స్టాప్‌లో రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

◆ ఇప్పటికే అధికారికంగా ఆరుగురు ప్రాణాలు కోల్పోయారని, అనేక మంది ప్రమాదాల భారిన పడుతున్నారన్నారు. ఫతేనగర్, శోభన కాలనీ, గౌతమ్‌నగర్ నుంచి రాజుకాలనీ ప్రభుత్వ హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు రోడ్డు దాటే సమయంలో ప్రమాదం పొంచి ఉందన్నారు. ఓ పక్కన రోడ్డుకు ఇరువైపులా వైన్‌షాపులు, కల్లు దుకాణాలు కూడా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే స్పందించి ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేసి విద్యార్థులకు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు



వి.రామారావునగర్‌లోని ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న నాగుల సత్యం

మోతీనగర్: దేవాలయాలు ఆధ్యాత్మికతకు, మానసిక ప్రశాంతతకు నిలయాలని కూకట్‌పల్లి బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు నాగుల సత్యం గంగపుత్ర అన్నారు. వి.రామారావునగర్‌లోని వినాయక, శివపార్వతి, నాగదేవత, హనుమాన్ ఆలయ వార్షికోత్సవ వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని పలు దేవత మూర్తులకు పంచామృతాభిషేకం, నూతన వస్త్రాలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో ఎస్. నరసింహయాదవ్, రామకృష్ణ, యాదగిరి, సుభాష్‌రెడ్డి, వెంకటయ్య యాదవ్, శివయ్య, యాదగిరి యాదవ్, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల చిన్నారుల కోసం ఇంటర్వెన్షన్ సెంటర్



సాక్షి, సిటీబ్యూరో: ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల కోసం కూకట్‌పల్లిలో 'ఇంటర్వెన్షన్ సెంటర్'ను ప్రారంభించారు. ప్రముఖ క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ శ్రీపూజ సిద్దంశెట్టి ఈ సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు అత్యుత్తమ సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. వీరి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కాగా ఇంటర్వెన్షన్ సెంటర్‌లో స్పీచ్ అండ్ లాంగ్వేజ్ థెరపీ, గెట్‌వెల్ థెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, తల్లిదండ్రులకు ప్రత్యేక కౌన్సిలింగ్ వంటి సేవలు లభిస్తాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా క్రైస్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ అన్నీ పాల్, అనలిస్ట్ ఆదిత్య పాల్గొన్నారు.